

## రక్షణ గోడలు శిథిలం

మండలంలోని ఘాట్‌రోడ్డులో ప్రమాదాల నివారణలో కీలకమైన రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 10లో



## సప్తగిరి బస్సులు మంజూరు

ఏడు సప్తగిరి బస్సులను మంజూరు చేస్తూ ఏపీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యుటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఉత్తర్వులు జారీ చేశారు. 10లో



## మోతుగూడెంలో 'కస్టడీ' సందడి

హీరో నాగ చైతన్య, హీరోయిన్ కృతిశెట్టితో తెరకెక్కిస్తున్న కస్టడీ సినిమాకు సంబంధించి పలు సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. 10లో


# సాక్షి
# అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023


## న్యూస్‌రీల్

### ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**అడ్డతీగల:** తిరుపతి శ్రీ సిటీలోని ఎస్ఎస్ ఇనుస్ట్రుమెంట్స్ ఇండియా లిమిటెడ్‌లో ఉద్యోగాలకు అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. వీటికి డిప్లమో ఉత్తీర్ణులు అర్హులన్నారు. డిగ్రీ బీఎస్సీ, ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్ గ్రూపుల్లో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వేతనం నెలకు రరూ.15,809 ఉంటుందని, అర్హులైన అభ్యర్థులు వివరాలకు 9398338105 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

### గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్టు

**జి.మాడుగుల:** మండలంలోని లువ్వాసింగి పంచాయతీలో గంజాయి కొనుగోలు చేసి కారులో తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులను గురువారం పట్టుకున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. లువ్వాసింగి పరిసర ప్రాంతాల్లో విశాఖకు చెందిన షేక్ మస్తాన్‌వలీ, శంకర్‌రావు, చింతపల్లి మండలం లోతుగెడ్డ గ్రామానికి చెందిన సురేష్, గోవిందరాజు, మరో ఇద్దరు 55కిలోల గంజాయి కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు కారులో బయలుదేరారు. జి.మాడుగులలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్టు ఎస్ఐ పేర్కొన్నారు. వీరిలో నలుగురిని అరెస్టు చేయగా ఈ కేసుతో ప్రమేయమున్న మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు చెప్పారు. నిందితుల నుంచి గంజాయి మూటలు, కారు, స్కూటీ, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

### ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి 27 వరకు గడువు

**కూనవరం:** ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి ఈనెల 27తో గడువు ముగుస్తుందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఈఏడాది నూతనంగా ఓపెన్ ఇంటర్ ప్రవేశానికి ఏపీ ఇంటర్ విద్యామండలి సార్వత్రిక విద్యావిధానం ద్వారా ప్రత్యేక అవకాశం కల్పించిందని ఆయన వెల్లడించారు. ఇంటర్ చదువుతూ మధ్యలో మానేసిన వారు, ఓపెన్ ఇంటర్‌లో చేరదలచిన వారు ఈనెల 27లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు ఆధార్ జెరాక్స్, టెన్త్ ఒరిజినల్ మార్కుల జాబితా, రిజిస్ట్రేషన్ నిమిత్తం మొబైల్ ఫోన్, పాస్‌పోర్టు సైజ్‌తో తమ కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

### విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధి



అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త దివ్యసుధ

**గూడెంకొత్తవీధి:** గిరిజన ప్రాంతాల్లో విరివిగా లభించే చిరుధాన్యాలు రాగులు, కొర్రలు, సామలుతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి ఎగుమతి చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా లబ్ధి పొందవచ్చని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త దివ్యసుధ సూచించారు. గురువారం మండలంలోని మంగళపాలెం గ్రామంలో మహిళలకు చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తినుబండారాల తయారీపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. చిరుధాన్యాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎస్ఎఫ్ రాజుబాబు, అంగన్‌వాడీ కార్యకర్త సోములమ్మ, పలు గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

### విజయసాయిరెడ్డికి అభినందనల వెల్లువ



విజయసాయిరెడ్డికి అభినందనలు తెలుపుతున్న ఎంపీ మాధవి, జీసీసీ, జెడ్పీ చైర్‌పర్సన్లు

**సాక్షి,పాడేరు:** ప్రతిష్ఠాత్మక పార్లమెంట్ రత్న అవార్డుకు ఎంపికైన రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖలోని విమానాశ్రయంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులతో పాటు, రాష్ట్ర జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతిదేవి ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్‌బాబు పాల్గొన్నారు.

# అమ్మ.. సురక్షితం



గర్భిణికి అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సంధ్యారాణి

- మూడంచెల పర్యవేక్షణతో బాసట
- రంపచోడవరం డివిజన్‌లో తగ్గుతున్న మాతా శిశు మరణాలు
- బర్త్ వెయింటింగ్ హాళ్లతో సత్ఫలితాలు
- ఐసీడీఎస్ పర్యవేక్షణలో పౌష్టికాహారం పంపిణీ

**మాతాశిశు మరణాలు అరికట్టడంలో రంపచోడవరం డివిజన్ పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారులు ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నారు. మూడంచెలుగా పర్యవేక్షిస్తున్నారు. గర్భిణులను సకాలంలో బర్త్ వెయిటింగ్ హాళ్లకు తరలిస్తున్నారు. పౌష్టికాహారం అందిస్తున్నారు. యాప్‌లో నమోదు చేసుకున్న వివరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దీనివల్ల మరణాల రేటు బాగా తగ్గింది. వీరిని ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని ఇటీవల వైద్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు.**



రంపచోడవరంలో బర్త్ వెయిటింగ్ హాల్‌లో గర్భిణులు

**శిశు మరణాలు**

| సంవత్సరం | నమోదు |
|---|---|
| 2018-19 | 67 |
| 2019-20 | 29 |
| 2020-21 | 32 |
| 2021-22 | 49 |
| 2022-23 | 30 |

**రంపచోడవరం:** రంపచోడవరం డివిజన్ పరిధిలో మాతా శిశు మరణాల సంఖ్య తక్కువగా నమోదవుతున్నాయి. ఇందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చేస్తున్న కృషి ఫలిస్తోంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను తగ్గించేందుకు వైఎస్సార్ సంపూర్ణ ప్లస్ పథకాన్ని అమలు చేస్తున్నారు. దీని ద్వారా గతంలో కంటే మెరుగైన పౌష్టికాహారం అందిస్తున్నారు.

గర్భిణులను పది, పదిహేను రోజుల ముందుగానే బర్త్ వెయింటింగ్ హాళ్లకు చేర్చుతున్నారు. సుఖ ప్రసవం జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అంతకంటే ముందు హైరిస్క్ కేసులను గుర్తించి, వారిని రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నారు.

**9,10 తేదీల్లో వైద్య పరీక్షలు**

పీఎం మాతృత్వ సురక్ష అభియాన్ పథకంలో ప్రతీ నెల 9,10 తేదీల్లో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, ప్రత్యేక వైద్యసేవలు అందిస్తున్నారు. క్రమేపీ శిశు మరణాల రేటును తగ్గించగలిగారు.

- 2018 నుంచి 2023 వరకు తల్లుల మరణాలు 42 నమోదయ్యాయి. రంపచోడవరం డివిజన్‌లో గుర్తేడు, రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై. రామవరం, మారేడుమిల్లి, చింతూరు, కూనవరంలో బర్త్‌వెయింటింగ్ కేంద్రాలు ఉన్నాయి.
- 2022-23 సంవత్సరానికి సంబంధించి (ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి వరకు) 1483 మంది గర్భిణులు బర్త్ వెయింటింగ్ హాళ్లకు వచ్చారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ప్రతి పీహెచ్‌సీలో బర్త్ వెయింటింగ్ హోమ్ ఏర్పాటు చేసి కొన్ని బెడ్‌లను కేటాయించారు.

**పర్యవేక్షణ ఇలా..**

**మొదటి దశ :** రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో 19 పీహెచ్‌సీలు ఉన్నాయి. గర్భిణులను క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశ వర్కర్, ఎంఎల్‌హెచ్‌పీ పర్యవేక్షణ చేస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితులు ప్రతీ రోజు తెలుసుకుంటున్నారు.



కొండమొదలు ఆర్అండ్ ఆర్ కాలనీలో గర్భిణులకు సూచనలు ఇస్తున్న ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు

**రెండో దశ :** గర్భిణులకు ఎటువంటి వైద్య సేవలు అందుతున్నాయనే దానిపై సీహెచ్‌వో, ఎంపీహెచ్‌వో, పీహెచ్ఎన్, హెల్త్ సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేస్తున్నారు.



రాజవొమ్మంగి పీహెచ్‌సీలో గర్భిణికి వైద్యసేవలందిస్తున్న వైద్యాధికారి

**మూడో దశ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు గర్భిణి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని అవసరాన్ని బట్టి ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నారు.



రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో బాలింతకు వైద్యసేవలందిసున్న సిబ్బంది

### పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

రంపచోడవరం, చింతూరు డివిజన్లలో ప్రస్తుతం 9149 గర్భిణులున్నారు. వీరిలో 5022 మందికి రక్తహీనత ఉన్నట్లుగా గుర్తించారు. వీరికి ప్రత్యేక పౌష్టికాహారం అందిస్తున్నాం. వీరిపై ప్రత్యేక శ్రద్ధ చూపేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో వివరాలు నమోదు చేశారు. హైరిస్క్ గర్భిణి వివరాలు అంగన్‌వాడీ కార్యకర్త నుంచి సీడీపీవో వరకు పర్యవేక్షణ చేసే విధంగా యాప్‌ను రూపొందించారు. ప్రతీ సూపర్‌వైజర్‌కు వారి సెక్టార్‌లో, ప్రతీ సీడీపీవోకు వారి ప్రాజెక్ట్ పరిధిలో ఎంత మంది హైరిస్క్ గర్భిణులు ఉన్నారు అనే సమాచారం అందుబాటులో ఉంటుంది. ఈ సమాచారం మేరకు గృహ సందర్శన చేసి గర్భిణులతో పాటుగా వారి కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కలిగిస్తున్నాం. అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలు వినియోగించుకుంటూ, బర్త్ వెయిటింగ్ హాల్స్‌కు ప్రసవానికి ముందుగానే రావాలి అని తెలియజేస్తున్నాం.

–సంధ్యారాణి, సీడీపీవో,రంపచోడవరం

### అన్నీ బాగున్నాయి



రంపచోడవరానికి 35 కిలోమీటర్ల దూరంలో మా ఊరు ఉంది. రంపచోడవరంలోని ఏరియా ఆస్పత్రి దగ్గర ఉన్న బర్త్‌వెయింటింగ్ హాలుకు పది రోజుల క్రితమే వచ్చాను. మా ఆశ వర్కర్ నాతోపాటు వచ్చి చేర్పించారు. ఇక్కడ అన్నీ బాగున్నాయి. ఉదయం టిఫిన్, అంబలి, అరటి పండు, రెండు పూటలా భోజనం పెడుతున్నారు. ఇక్కడ ఉండడం వల్ల ప్రసవం కోసం ఎటువంటి భయం లేదు.

– కుంజం భవాని, గర్భిణి, కోట గ్రామం, వై.రామవరం మండలం

### పర్యవేక్షణతో తగ్గుదల



హైరిస్క్ గర్భిణులను ప్రసవానికి 20 రోజుల ముందే పీహెచ్‌సీలకు తరలిస్తున్నాం. అక్కడ వారిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక సూపర్‌వైజర్లను ఏర్పాట్లు చేశాం. అనంతరం 15 ముందు దగ్గర్లో సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులకు తరలిస్తున్నాం. ప్రసవం అయిన తరువాత ఏడు రోజుల పాటు పర్యవేక్షిస్తున్నాం. దీంతో మాతా శిశుమరణాలు గణనీయంగా తగ్గాయి.

– అనూష, ఏడీఎంహెచ్‌వో, రంపచోడవరం

### సమర్థవంతంగా పనితీరు



రంపచోడవరం పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ బృందాలు, అంగన్‌వాడీ వ్యవస్థ మాతాశిశు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయి. గత నాలుగేళ్లలో శిశు మరణాల సంఖ్య తక్కువగా ఉంది. తల్లి పాలు పట్టడం, శిశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. అక్కడి ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల విధులను పరిగణనలోకి తీసుకుని జిల్లా వ్యాప్తంగా శిశు మరణాలకు వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలి.

– సుమిత్‌కుమార్, కలెక్టర్

# ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పిలుపు
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఈనాడు పత్రిక ప్రతుల దహనం



గూడెంకొత్తవీధిలో తప్పుడు కథనాలు ప్రచురించిన ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పార్టీ నేతలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ శ్రేణులు

**గూడెంకొత్తవీధి:** పట్టాభి లాంటి టీడీపీ నాయకులు ఎన్ని కుయుక్తులు, నాటకాలు ఆడినా ప్రజలు వాటిని నమ్మే పరిస్థితుల్లో లేరని ప్రభుత్వంపై ఉద్దేశ పూర్వకంగా జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు కథనాలను ప్రచురించిన ఈనాడు పత్రిక ప్రతులను గురువారం గూడెంకొత్తవీధిలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆమె దహనం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ దేశంలోనే ఆదర్శవంతంగా నిలుస్తుందన్నారు. ప్రజల్లో తమ ప్రభుత్వానికి ఉన్న ఆదరణను చూసి ఓర్వలేని తనంతో ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా చేతులు కలిపి కావాలనే తప్పుడు ప్రచారానికి కుట్రలకు పూనుకుంటున్నాయన్నారు. టీడీపీ ఎన్ని దొంగనాటకాలు ఆడినా భవిష్యత్తులో ఆపార్టీ అధికారంలోకి రావడం అసాధ్యమన్నారు. సొంతమామను వెన్నుపోటు పొడిచి అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. లోకేష్ పాదయాత్ర కేవలం తమ పార్టీ ఉనికిని చాటుకునేందుకు తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. టీడీపీ నాయకులు విలువలకు తిలోదకాలు ఇచ్చి నీచరాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆమె అన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**పాత ఫొటోలకు మార్ఫింగ్ చేసి కథనాలు**

**అరకులోయ రూరల్:** టీడీపీ నేతల దుష్ప్రచారాలు ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నేత పట్టాభిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి హింసించారని తప్పుడు కథనాలు ప్రచురించడం సరికాదన్నారు. పాత ఫొటోలను మార్ఫింగ్ చేసి టీడీపీకి అనుకూల పత్రికల్లో ప్రచురించారన్నారు. ప్రభుత్వానికి లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే టీడీపీ ఇటువంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతూ దుష్ప్రచారానికి దిగుతోందని విమర్శించారు. 2024 ఎన్నికల్లో ఆ పార్టీ భూస్థాపితం ఖాయమన్నారు. పార్టీలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని, కక్ష పూరిత రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. యువజన విభాగం పార్టీ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్‌లు భాస్కరరావు, నాగేశ్వరరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్ చార్జ్ హస్తినాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన నామినేషన్ల పర్వం

- మొత్తం 44 మంది నామినేషన్లు దాఖలు
- చివరి రోజున 26 నామినేషన్లు
- 27 వరకూ ఉపసంహరణకు గడువు

**సాక్షి, విశాఖపట్నం :** ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం ముగిసింది. గురువారం చివరి రోజున 26 నామినేషన్లు కలిపి మొత్తం 44 నామినేషన్లు, 70 సెట్లు దాఖలయ్యాయి. ఉపసంహరణకు ఈ నెల 27వ తేదీ వరకూ అవకాశం కల్పించారు. గురువారం టీడీపీ తరఫున మరో అభ్యర్థి నామినేషన్ వేశారు. అనకాపల్లి జిల్లాకు చెందిన గూనూరు మల్లునాయుడు టీడీపీ రెబల్‌గా మారారు. బీసీలకు టికెట్ అంటూ మోసం చేసిన తెలుగుదేశం పార్టీపై ఎదురు తిరుగుతూ.. రెబల్ అభ్యర్థిగా బరిలో ఉన్న ఈర్లె శ్రీరాములు.. టీడీపీకి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ తరఫున విశాఖకు చెందిన కొణతాల వెంకట అప్పారావు బరిలో దిగారు.

**గత ఎన్నికల కంటే ఎక్కువ మందే...**

2017 ఎన్నికల్లో మొత్తం 40 మంది నామినేషన్లు దాఖలు చేయగా.. 30 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ సారి ఏకంగా 44 మంది నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో కనీసం 8 నుంచి 10 మంది ఉపసంహరించుకునే అవకాశం ఉంది. కాబట్టి.. గత ఎన్నికల కంటే ఎక్కువ మంది తుది పోరుకు బరిలో ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 331 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. 3.17 లక్షల బ్యాలెట్ పత్రాలు ముద్రించాలని నిర్ణయించారు. ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత.. పట్టభద్రుల ఎన్నికల బరిలో ఎంత మంది నిలుస్తారు.? వారి పేర్లని ఆర్డర్ల ప్రకారం ఎలా అమర్చాలి అనే అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని బ్యాలెట్ పత్రాల ముద్రణకు సన్నద్ధమవుతామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున, ఏఆర్‌వోగా వ్యవహరిస్తున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి వెల్లడించారు. ఇప్పటికే వైట్ బ్యాలెట్ పేపర్లకు సంబంధించి పూర్తి బండిల్స్ సిద్ధంగా ఉంచామనీ.. 28వ తేదీ తర్వాత ముద్రణకు పంపించనున్నట్లు తెలిపారు.

# తుప్పలతో నీటి సరఫరాకు అంతరాయం



సొరంగ మార్గంవద్ద తుప్పలను పరిశీలిస్తున్న సిబ్బంది

**ముంచంగిపుట్టు:** ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ విద్యుత్ కేంద్రానికి నీరు వెళ్లే సొరంగ మార్గంలో తుప్పల కారణంగా సరఫరాకు గురువారం అంతరాయం ఏర్పడింది. జోలాపుట్ జలాశయంలో విడుదలైన నీరు డైవర్షన్ డ్యాం వరకు వచ్చిన తరువాత అక్కడ నుంచి ప్రత్యేక కెనాల్లోకి వెళ్తుంది. టీపీ డ్యాం నుంచి ప్రత్యేక సొరంగమార్గం ద్వారా విద్యుత్ కేంద్రం వాల్వుహౌస్‌కు చేరుతుంది. అయితే టీపీ డ్యాం సొరంగం వద్ద తుప్పలు పేరుకుపోవడంతో నీటిసరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీనిని గమనించిన సిబ్బంది అధికారులకు సమాచారం అందించారు. ప్రాజెక్టు ఎస్ఈ నాగేశ్వరరావు, సిబ్బంది టీపీ డ్యాం వద్దకు చేరుకున్నారు. తుప్పలు భారీగా పేరుకుపోవడం వల్లే నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుర్తించారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో డుడుమ డ్యామ్ నుంచి నీటి విడుదల తగ్గించారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే శుక్రవారం ఉదయం సొరంగంలో ఉన్న తుప్పలను తొలగించాలని సిబ్బందికి సూచించినట్టు ఎస్ఈ తెలిపారు.

# ఇద్దరికి డెంగ్యూ

**మారేడుమిల్లి :** మండలంలోని వేటుకూరు బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థిని కె. లక్ష్మీప్రసన్న నాలుగు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. గురువారం ఆమెకు పాఠశాల సిబ్బంది వైద్య పరీక్షలు చేయించగా డెంగ్యూ నిర్ధారణ అయింది. అలాగే మండలంలోని మరొక ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థిని పి.మధుప్రియకు కూడా డెంగ్యూ నిర్ధారణ అయినట్టు సమాచారం. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

# పవర్ కెనాల్‌కు మరమ్మతులు పూర్తి

**మోతుగూడెం :** సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి పవర్ కెనాల్‌కు మరమ్మతులు పూర్తయ్యాయయని ఏపీ జెన్‌కో ఎస్ఈ కేవీపీ ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2022 డిసెంబరు 14వ తేదీ అర్ధరాత్రి డొంకరాయి పవర్ కెనాల్ గండి పడిందన్నారు. యుద్ధ ప్రతిపాదిక పనులు చేపట్టి నెలరోజుల్లో రోజుల్లో పూర్తి చేశామన్నారు. ఏపీ జెన్‌కో ఉన్నతాధికారులు, సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్లు, పర్యవేక్షణలో శరవేగంగా పనులు చేపట్టామన్నారు. కెనాల్ లోపల భాగం వైపు పూర్తి నాణ్యతతో కాంక్రీట్ పనులు పూర్తి చేశామన్నారు. అనంతరం కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసినట్టు చెప్పారు. మరో పక్క విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం లేకుండా చూశామని ఆయన పేర్కొన్నారు. అనంతరం కెనాల్ బయటి వైపు మట్టి పనులు, కాంక్రీట్ పనులు శరవేగంగా నిర్వహించి పూర్తి చేశామని చెప్పారు. పవర్ కెనాల్‌కు ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కెనాల్ అవుట్ సైడ్ భాగంలో రివిట్‌మెంట్ పనులు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. పవర్ కెనాల్ నుంచి అవుట్ సైడ్‌కు వచ్చే ఊట నీరు వెళ్లేందుకు చిన్న కాలువలను కాంక్రీట్‌తో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పవర్ కెనాల్‌కు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిరంతరం ఇంజినీర్ల పర్యవేక్షణలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# పెట్రోల్, డీజిల్ పక్కదారి పడితే చర్యలు

- హెచ్‌పీసీఎల్ ఉమ్మడి విశాఖ సేల్స్ ఆఫీసర్ యాస్ మిశ్రా



పెట్రోల్ బంకులో రికార్డులను పరిశీలిస్తున్న సేల్స్ ఆఫీసర్ యాస్ మిశ్రా, తహసీల్దార్ రాజ్యలక్ష్మి

**హుకుంపేట:** గిరిజన సహకార సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు నుంచి పెట్రోల్,డీజిల్ పక్కదారి పడితే చర్యలు తప్పవని హెచ్‌పీసీఎల్ ఉమ్మడి విశాఖ సేల్స్ ఆఫీసర్ యాస్ మిశ్రా హెచ్చరించారు. గురువారం స్థానిక జీసీసీ పెట్రోల్ బంకులో ఆయన తనిఖీలు నిర్వహించారు. పెట్రోల్, డీజిల్ నాణ్యతను పరిశీలించారు. అమ్మకం , స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఎయిర్ మిషన్ ఏర్పాటు చేయకపోవడంతో కొంత వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోనే పలు దుకాణాల వద్ద పెట్రోల్, డీజిల్ విక్రయాలు చేస్తున్నారన్నారు. వీటికి అడ్డుకట్ట వేస్తే జీసీసీ బంక్‌కు మరింత ఆదాయం పెరుగుతుందన్నారు. ఎయిర్ మెషీన్ ఏర్పాటుచేయాలని మేనేజర్‌ను ఆదేశించారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఆర్ఐ రంగారావు, వీఆర్వో కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

# వారధిలా పనిచేయండి

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



హాజరైన గృహసారథులు, కన్వీనర్లు



మా నమ్మకం నువ్వే జగనన్న బ్రోచర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

**గూడెంకొత్తవీధి:** ప్రభుత్వానికి ప్రజలకూ వారధులు మీరేనని.. జగనన్న పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వారికి వివరించాల్సిన తరుణం ఆసన్నమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం గూడెంకొత్తవీధి సచివాలయం పరిధిలో కన్వీనర్లు, గృహసారథులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఎంత మంచి చేస్తున్నా ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. వీటన్నింటినీ ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. గడచిన ప్రభుత్వాలేవీ ఇంతగా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించలేదన్న విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు.మా నమ్మకం నువ్వే జగనన్న బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, వైస్ఎంపీపీలు ఆనంద్, దేవుడుబాబు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, స్థానిక సర్పంచ్ సుభద్ర, మండల కన్వీనర్ పోతురాజు, స్థానిక ఎంపీటీసీలు రాజులమ్మ, నాగమణి, పీఏసీఎస్ చైర్మన్ ప్రసాద్, సర్పంచ్‌లు కృష్ణవంశీ, నాగులమ్మ, లక్ష్మి, వీరేంద్ర ప్రసాద్, నాగరాజు, బుజ్జిబాబు, కమలమ్మ కుమారి, కాసులమ్మ, పిల్లా సాంబమూర్తి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రవిబాబుకు ఎంపీ మాధవి అభినందనలు



డాక్టర్ రవిబాబుకు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలుపుతున్న ఎంపీ గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులు

**సాక్షి, పాడేరు:** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా డాక్టర్ కుంభా రవిబాబును సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సిఫార్సు చేయడంపై అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఆమె భర్త శివప్రసాద్‌లు హర్షం వ్యక్తం చేశారు. వారు గురువారం రవి బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్‌బాబు తదితరులున్నారు.

### మావోయిస్టు నేత అరెస్టుతో అప్రమత్తం



వై.రామవరం ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

**వై.రామవరం:** మావోయిస్టు నేత అరెస్టుతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. మవోయిస్టు నేత జనుమూరి శ్రీనుబాబు అలియాస్ సునీల్ అలియాస్ రైనోను ఏవోబీలో అరెస్టు చేసినట్లు ఎస్పీ సతీష్ కుమార్ ధ్రువీకరించడం తెలిసిందే. దీంతో జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా సీఐ వై.రాంబాబు ఆదేశాల మేరకు ఎస్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని లోతట్టు ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారుల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాల్లో రవాణా చేస్తున్న సామగ్రిని పరిశీలించారు. అనుమానితులు, అపరిచితులపై గట్టి నిఘా ఏర్పాటుచేశారు. సీఆర్‌పీఎఫ్ డీ42 బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

# మన్యం కాఫీ అ'ధర'హో

- నర్సీపట్నం కాఫీ క్యూరింగ్ సెంటర్‌లో జోరుగా పనులు
- అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ధర
- దిగుబడి మెరుగుపడడంతో ఆదాయం పెరిగే అవకాశం
- ఈ ఏడాది 27 మెట్రిక్ టన్నుల విక్రయం
- వేలానికి సిద్ధంగా మరో 53 మెట్రిక్ టన్నుల శుద్ధి కాఫీ



మాన్యువల్ పద్ధతిలో కాఫీ గింజలను వేరుస్తున్న కార్మికులు



కాఫీ గింజలను శుద్ధి చేసే యంత్రాలు

**నర్సీపట్నం:** అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరగడంతోపాటు దిగుబడి మెరుగుపడడంతో నర్సీపట్నంలోని కాఫీ క్యూరింగ్ సెంటర్ శుద్ధీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏపీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక కాఫీ శుద్ధి కేంద్రమిది. జనవరిలో క్యూరింగ్ పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధీనంలో ఏజెన్సీలో 8 వేల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే కాఫీ గింజలను నర్సీపట్నంలోని క్యూరింగ్ సెంటర్‌లో శుభ్రం చేసి ఈ-వేలం ద్వారా విక్రయిస్తుంటారు. ఆరేళ్ల క్రితం ఈ కేంద్రం ద్వారా 1500 మెట్రిక్ టన్నుల నుంచి 2 వేల టన్నుల వరకు కాఫీ గింజలను శుద్ధి చేసేవారు. రానురాను పంట దిగుబడి తగ్గడంతో 400 మెట్రిక్ టన్నుల లోపే ఉత్పత్తి జరుగుతోంది. గత ఏడాది శుద్ధి చేసిన 180 మెట్రిక్ టన్నుల కాఫీ విక్రయించారు. అప్పట్లో అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో రూ.331 ధర పలకడంతో రూ.5 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ఈ ఏడాది 230 మెట్రిక్ టన్నుల కాఫీని క్యూరింగ్ చేయాలని ఏపీఎఫ్‌డీసీ లక్ష్యంగా నిర్దేశించింది. ఇంత వరకు 80 మెట్రిక్ టన్నుల కాఫీని శుద్ధి చేశారు. అందులో 27 మెట్రిక్ టన్నుల కాఫీని విక్రయించగా రూ.కోటి ఆదాయం వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం కిలో కాఫీ ధర రూ.400 పలుకుతోంది. మరో 53 మెట్రిక్ టన్నుల శుద్ధి చేసిన కాఫీ అమ్మకానికి సిద్ధంగా ఉందని అధికారులు చెబుతున్నారు. శుద్ధి చేసిన క్లీన్ కాఫీని ఐదు దఫాలుగా ఈ-వేలం ద్వారా విక్రయించనున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఉత్పత్తి పెరగడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉండటంతో రూ. 6 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశ ఉందని కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు.

### ధర కలిసొచ్చింది...

కాఫీ దిగుబడి గత ఏడాది కంటే పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో విశాఖ ఏజెన్సీ కాఫీకి గత ఏడాది నుంచి ధర కలిసొచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో కాఫీ ధర రూ.390 నుంచి రూ.400 వరకు ఉంది. ఈసారి రూ.6 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. బ్రెజిల్ కాఫీ దిగుబడి తగ్గడంతో మన ఏజెన్సీ కాఫీకి డిమాండ్ ఏర్పడింది. రానున్న రోజుల్లో పరిస్థితి మరింత మెరుగుపడనుంది.

–ఎస్.స్వర్ణలత, డివిజనల్ మేనేజర్, కాఫీ క్యూరింగ్ సెంటర్, నర్సీపట్నం

# జి-20 సదస్సులో గిరిజన యువత ఉపాధిపై చర్చించాలి

- మంత్రి అమర్‌నాథ్‌కు అరకు ఎమ్మెల్యే పాల్గుణ వినతి



జిల్లా ఇన్‌చార్జి మంత్రి అమర్‌నాథ్‌తో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

**సాక్షి, పాడేరు:** విశాఖ వేదికగా జరగనున్న జి-20 సదస్సులో గిరిజన యువతకు ఉపాధి, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సహకాలు అందించే అంశాలపై చర్చించాలని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి గుడివాడ అమర్‌నాథ్‌ను అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ కోరారు. గురువారం మంత్రిని ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా అరకు నియోజకవర్గంలోని పెండింగ్ పనులు, గిరిజన యువతకు ఉద్యోగాల విషయాలపై చర్చించారు. స్టార్టప్ కంపెనీల ద్వారా గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు పెట్టుబడుల సాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై మంత్రి అమర్‌నాథ్ స్పందించి గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు యువ పారిశ్రామికవేత్తలకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే పాల్గుణ 'సాక్షి'కి తెలిపారు.

# నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న అనిత

**చింతపల్లి:** వివిధ నిర్మాణాలకు సంబంధించి పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా పట్టణ గ్రామీణ ప్రణాళిక అధికారి కె.అనిత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీ పరిధిలో చేపడుతున్న గృహ, వాణిజ్య దుకాణాల నిర్మాణాలకు సంబంధించి ప్లాన్ అప్రూవల్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతించిన నిర్మాణాలకు ప్రభుత్వ అర్హత పొందిన సర్వేయర్ల వద్ద నుంచి ప్లాన్ తీసుకోవాలని సూచించారు. అపార్ట్‌మెంట్లు, వాణిజ్య పరమైన దుకాణాల నిర్మాణాలకు డీటీసీపీ వద్ద అనుమతులు తీసుకోవాలన్నారు. 2.5 ఎకరాల విస్తీర్ణంలోపు నిర్మాణాలకు జిల్లా కార్యాలయంలో అనుమతులు మంజూరవుతుందని చెప్పారు. 2.5 ఎకరాలకు మించి నిర్మాణాలు చేపడితే రీజనల్ కార్యాలయం నుంచి, అంతకు మించి ఐదెకరాలకు దాటితే మంగళగిరి ప్రధాన కార్యాలయం నుంచి ప్లాన్ అప్రువల్ తీసుకోవలసి ఉంటుందన్నారు. ప్రతి నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిన రుసుము చెల్లించాలని ఆమె తెలిపారు. పంచాయతీ పరిధిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా భూమికి సంబంధించిన పట్టా గాని, తహసీల్దార్ జారీ చేసిన హక్కు పత్రం గాని అందజేయాలన్నారు. మూడు మండలాల ఈవోపీఆర్డీవోలు శ్రీనివాస్, నాయుడు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# సప్తగిరి బస్సులు మంజూరు

- పాడేరు డిపోకు ఏడు కేటాయింపు

**సాక్షి,పాడేరు:** పాడేరు ఆర్టీసీ డిపోకు ఏడు సప్తగిరి బస్సులను మంజూరు చేస్తూ ఏపీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యుటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఉత్తర్వులు జారీ చేశారు. పాడేరు డిపోకు 10 బస్సులు మంజూరు చేసి రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని గతంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆర్టీసీ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. ఈనేపథ్యంలో కొత్తగా ఏడు బస్సులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయని పాడేరు ఆర్టీసీ డిపోమేనేజర్ రోణంకి సీతారాంనాయుడు తెలిపారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరైన ఏడు సప్తగిరి బస్సులను తిరుపతి డిపో నుంచి ఇక్కడికి పంపిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్చి ఒకటో తేదీ నుంచి సప్తగిరి బస్సులను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఇలావుండగా పాడేరు ఆర్టీసీ డిపో నుంచి రంపచోడవరం,చింతూరు వంటి దూర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు అందుబాటులోకి తేవాలని ఆలోచన చేశారు. దీనిలో భాగంగా పాడేరు నుంచి సీలేరు మీదుగా చింతూరుకు రెండు, రంపచోడవరానికి ఒకటి, చింతపల్లి, అరకులోయ, ముంచంగిపుట్టు రూట్లలో మూడు బస్సులు, పాడేరు నుంచి హుకుంపేట, కించుమండ జంక్షన్ మీదుగా అనంతగిరి మండలం వేంగడ ప్రాంతానికి ఒక బస్సును నడపనున్నారు.

### సనాతన ధర్మ పరిరక్షణకు కృషి



కోల్హాపూర్‌లో మహోత్సవాల్లో పాల్గొన్న తణుకు వెంకటరామయ్య(తెలుపు దుస్తుల్లో ఉన్న వ్యక్తి)

**అడ్డతీగల:** సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్నట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య చెప్పారు. మహారాష్ట్రలోని కోల్హాపూర్‌లో సిద్ధగిరి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పంచ మహాభూత మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో హైందవ ధర్మ పరిరక్షణ, లోక కల్యాణార్థం సాధు సంతుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆయన చెప్పారు.

# మోతుగూడెంలో 'కస్టడీ' సందడి



లోకేషన్‌లో హీరోయిన్ కృతిశెట్టి, హీరో నాగ చైతన్య

- నాగచైతన్య, కృతిశెట్టితో పలు సన్నివేశాల చిత్రీకరణ

**మోతుగూడెం:** మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. హీరో నాగ చైతన్య, హీరోయిన్ కృతిశెట్టితో తెరకెక్కిస్తున్న కస్టడీ సినిమాకు సంబంధించి పలు సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ పవన్ కుమార్ సమర్పిస్తున్న ఈ సినిమాకు డైరెక్టర్‌గా వెంకట ప్రభు, ప్రొడ్యూసర్‌గా చిట్టాల శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. బుధవారం ఇక్కడికి సమీపంలోని సీలేరు నదిలో హీరో హీరోయిన్లపై పలు సన్నివేశాలు చిత్రీకరించారు. గురువారం డొంకరాయి జలాశయం పరిసరాలో సన్నివేశాలు చిత్రీకరిస్తామని యూనిట్ సభ్యులు తెలిపారు. ఈ చిత్రంలో హీరో శరత్ కుమార్ కూడా ముఖ్య పాత్ర పోషిస్తున్నట్లు వారు తెలిపారు. సినిమా షూటింగ్‌ను తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భారీగా తరలి వచ్చారు.

# రక్షణ గోడలు శిథిలం

- పొంచి ఉన్న ప్రమాదం

**అనంతగిరి:** మండలంలోని ఘాట్‌రోడ్డులో ప్రమాదాల నివారణలో కీలకమైన రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరి కొన్ని చోట్ల కూలిపోవడంతో వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. అరకు-విశాఖ ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది సంఖ్యలో వాహన రాకపోకలు సాగుతున్నాయ. పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు పర్యాటకులు వాహనాల్లో ఘాట్‌రోడ్డు మీదుగా అరకులోయకు చేరుకుంటారు. అలాగే స్థానికులు, ఉద్యోగులు, వ్యాపారులు వాహనాలతో రాకపోకలు సాగిస్తారు. డముకు తైడ మధ్యలోని హెయిర్‌పిన్‌బెండ్ నాలుగో మలుపు మీద రక్షణగోడ కూలి చెట్టుకు అనుకుని ఉంది. ప్రమాదకర పరిస్థితులు పొంచి ఉండడంతో వాహనచోదకులు భయోందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలిన గోడను తొలగించి, రక్షణగోడ నిర్మించాలని వారు కోరుతున్నారు.

# అస్వస్థతతో గిరిజనుడి మృతి



భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య సారమ్మ

**చింతూరు:** మండల కేంద్రంలో బుధవారం జరిగిన సంతకు వచ్చిన కూనవరం మండలం చింతాగండి గ్రామానికి చెందిన పల్లా కొమ్మిరెడ్డి (60)అనే గిరిజనుడు అస్వస్థతకు గురై గురువారం మృతి చెందాడు. భార్య సారమ్మతో కలిసి సంతకు వచ్చిన కొమ్మిరెడ్డి రాత్రి ఇంటికి వెళ్లే క్రమంలో దారి తెలియలేదు. దీంతో స్థానిక శబరి నది వంతెన సమీపంలోని రహదారి పక్కనే వారిరువురు నిద్రపోయారు. అయితే గురువారం మధ్యాహ్నం అయినా భర్తలో కదలిక లేకపోవడంతో ఆమె ఆందోళన చెందింది. ఎండవేడిమికి అస్వస్థతకు గురై తన భర్త మృతి చెందినట్టు ఆమె పేర్కొంది.

# విద్యతోనే ఉన్నత భవిత



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

- ఏఎస్పీ శివప్రతాప్ కిషోర్

**చింతపల్లి:** విద్యతోనే ఉన్నత భవిత చేకూరుతుందని ఏఎస్పీ శివప్రతాప్ కిషోర్ చెప్పారు. మండల కేంద్రంలోని గురువారం జరిగిన సెయింట్ ఆన్స్ పాఠశాల వార్షికోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పోటీలతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతోందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ప్రిన్సిపాల్ మేరి, సీఐ రమేష్, సర్పంచ్ దురియా పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

**కశింకోట:** ప్రియురాలి కోసం ప్రైవేట్ కళాశాల బస్సులో వీరంగం సృష్టించి డ్రైవర్‌ను కత్తితో పొడిచేందుకు ప్రయత్నించిన తాపీమేస్త్రీని గురువారం అరెస్టు చేశారు. మండలంలోని బయ్యవరం వద్ద జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి విలేకరులకు అందించిన వివరాల ప్రకారం.. మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన తాపీమేస్త్రి గరసాల శివసాయి (22) ఇక్కడి మరో గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థినిని ప్రేమించానంటూ కొంత కాలంగా వెంటపడుతున్నాడు. దీనిలో భాగంగా ఈనెల 21 సాయంత్రం అనకాపల్లి నుంచి తేగాడ వైపు వెళుతున్న అనకాపల్లికి చెందిన సంయుక్త ప్రైవేట్ కళాశాల బస్సును మార్గమధ్యలో స్కూటీ అడ్డంగా పెట్టి నిలిపాడు. తన ప్రియురాలిని బస్సులో నుంచి కిందకు దించాలని బస్సు డ్రైవర్ రొంగలి దేముళ్లను డిమాండ్ చేస్తూ దూషించాడు. అంతే కాక బస్సులో వీరంగం సృష్టించి డ్రైవర్ మెడపై కత్తి పెట్టి చంపుతానని బెదిరించాడు. దీంతో విద్యార్థులు, డ్రైవర్ భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనపై డ్రైవర్ దేముళ్ల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# చికిత్స పొందుతూ పసికందు మృతి

- ఊపిరితిత్తుల్లోకి పాలు చేరడంతో తీవ్ర అస్వస్థత




పసికందు మృతదేహం

**రాజవొమ్మంగి:** మండలకేంద్రం రాజవొమ్మంగికి చెందిన మూడు నెలల పసికందు మృతి చెందింది. స్థానిక పీహెచ్‌సీలో నవంబర్ 21న మిరియాల సరస్వతి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు ఇది రెండో కాన్పు. కాగా మూడు రోజుల క్రితం (21వ తేదీ) పాప తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే స్థానిక పీహెచ్‌సీకు తరలించారు. మెడికల్ ఆఫీసర్ లిఖిత పరీక్షించి అడ్డతీగల నవజాత శిశుసంరక్షణ కేంద్రానికి రిఫర్ చేశారు. అక్కడి వైద్యులు పాపను రంపచోడవరం ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందిందని కుటుంబసభ్యులు తెలిపారు. దీనిపై స్థానిక వైద్యాధికారి లిఖితను వివరణ కోరగా తల్లి పొత్తిళ్లలో పాపకు సక్రమంగా పాలు పట్టక పోవడంతో ఊపిరి తిత్తుల్లోకి చేరాయన్నారు. దీనివల్ల అస్వస్థతకు గురైందన్నారు. ఊపిరితిత్తుల్లో చేరిన పాలను బయటకు తీసేందుకు శతవిధాలా ప్రయత్నించామని చెప్పారు. అయినా పాప ప్రాణం దక్కలేదన్నారు. చిన్న పిల్లలకు పాలు పట్టే సమయంలో తల్లులు సంయమనం పాటించాలని ఆమె సూచించారు. మంచంపై పడుకొని పాలు పట్టవద్దన్నారు. పాలు పట్టిన తరువాత భుజంపై వేసుకొని అటూ ఇటూ రెండు సార్లు తిరిగితే పాపకు తేన్పులు వస్తాయన్నారు. అప్పుడు పాపను పడుకోబెట్టినా ఏం కాదన్నారు. చిన్న పిల్లలకు పాలు పట్టడంపై తల్లులకు తమ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

# చిత్రలేఖన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

- బంగారు పతకాలు సాధన



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు, డ్రాయింగ్ టీచర్ కొండబాబు, హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు

**రాజవొమ్మంగి:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు నెల్లూరులో జరిగిన చిత్రలేఖన పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. వీరిని గురువారం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం పీ. శ్రీనివాసరావు, డ్రాయింగ్ టీచర్ మిరియాల కొండబాబు ఆధ్వర్యంలో జరిగిన సభలో అభినందించారు. నెల్లూరుకు చెందిన అమీర్ ఆర్ట్ అకాడమి ఆల్‌ఇండియా స్థాయిలో ఇటీవల నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సుమారు మూడు వేల మంది పాల్గొన్నారు. వీరిలో రాజవొమ్మంగి నుంచి 45 మంది పాల్గొనగా హారిక, హాసినిప్రియ, కామేశ్వరి, శ్రీదుర్గ, వీరలక్ష్మి, అపర్ణ బంగారు పతకాలు సాధించారు. వీరికి నిర్వాహకులు పతకాలతో పాటు బాలచిత్రకళాశ్రీ అవార్డు అందజేసినట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. డ్రాయింగ్ టీచర్ కొండబాబును ఆర్ట్ గురు టైటిల్‌తో సత్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు సాధించిన అవార్డులు, బహుమతులను ప్రదర్శించారు.

# రెండు పశువుల పాకలు దగ్ధం



దగ్ధమైన పశువుల పాకలు

**చోడవరం రూరల్:** మండలంలోని గజపతినగరం గ్రామంలో గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన శరగడం వెంకటరమణకు చెందిన రెండు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. పాకలో దాచుకున్న ఏడు ఎరువుల బస్తాలు, మోటారు పంపు హోస్‌పైపులు మంటలకు కాలి బూడిదయ్యాయి. పాకలకు ఆనుకుని ఉన్న గుంజకు కట్టిన ఆవుపెయ్యకు మంటల సెగ తాకడంతో పాక్షికంగా గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న చోడవరం అగ్నిమాపక దళాధికారి బీవీ రామస్వామి సిబ్బందితో ప్రమాద స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. బీఎస్ రోడ్డుకు సమీపంలో బాధితుల నివాసాలు, వాటిని ఆనుకుని పశువుల పాకలు ఉండడంతో ఎవరైనా కాల్చిపారేసిన సిగరెట్ రాజుకుని ప్రమాదం సంభవించి ఉంటుందని అనుమానిస్తున్నారు.

# డిక్కీలో నగదు చోరీ

**యలమంచిలి:** పట్టణంలో గురువారం స్కూటీ డిక్కీలో భద్రపరిచిన రూ. 2 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. దీనికి సంబంధించి పట్టణ అదనపు ఎస్ఐ కె. వెంకటరావు తెలియజేసిన వివరాల ప్రకారం.. యలమంచిలి నెహ్రూనగర్‌కు చెందిన చెక్కా అప్పారావు స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ నుంచి రూ. 2.38 లక్షల నగదు విత్ డ్రా చేశారు. బ్యాంక్ నుంచి బయటికి వచ్చి తన స్కూటీ డిక్కీలో రూ. 2 లక్షలు ఉంచి పాడైన నోట్లను బ్యాంకులో తిరిగి ఇచ్చేందుకు బ్యాంక్‌లోకి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి తన స్కూటీ డిక్కీలో ఉంచిన రూ. 2 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో లబోదిబోమంటూ యలమంచిలి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటరావు తెలిపారు.